క్లుప్తంగా

ఎస్‌హెచ్‌వోగా ట్రైనీ ఐపీఎస్

చొప్పదండి: చొప్పదండి పోలీస్ స్టేషన్‌కు ఎస్‌హెచ్‌వోగా ట్రైనీ ఐపీఎస్ నియామకమయ్యారు. మూడు నెలల పాటు విధులు నిర్వహించేందుకు మహేశ్ బి గీతే సోమవారం బాధ్యతలు చేపట్టారు. మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజలు సహకరించాలని కోరారు. సీఐ రవీందర్, ఎస్‌ఐ ఉపేంద్రచారి స్వాగతం పలికారు.

భూమిపూజ

చొప్పదండి: మండలంలోని చిట్యాలపల్లిలో బోర్‌వెల్ పనులకు జెడ్పీటీసీ మాచర్ల సౌజన్య సోమవారం భూమిపూజ చేశారు. జిల్లా పరిషత్ స్పెషల్ గ్రాంట్ నుంచి బోర్‌వెల్ వేసి నీటి సౌకర్యం కల్పించనున్నామని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ సురేశ్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, మధు, మనోహర్, తిరుపతి, మల్లేశం, తదితరులు పాల్గొన్నారు.

న్యూట్రిషన్ కిట్లు పంపిణీ

వీణవంక: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మెరుగైన వసతులున్నాయని, రాష్ట్రం ఏర్పడిన తర్వాత ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలు ఎక్కువగా జరుగుతున్నాయని ఎంపీపీ ముసిపట్ల రేణుక అన్నారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో న్యూట్రిషన్ కిట్లు పంపిణీ చేశారు. బాలింతలు, గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ లత, సర్పంచ్ కుమార్, ఉపసర్పంచ్ భానుచందర్, ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీవో ప్రభాకర్, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

విత్తనాలు విత్తుకోవద్దు

గన్నేరువరం: నైరుతి రుతుపవనాలు రాక ఆలస్యంతో అవుతోందని, రైతులు తొందరపడి విత్తనాలు విత్తుకోవద్దని వ్యవసాయశాఖ అధికారి కిరణ్మయి సోమవారం తెలిపారు. రైతులకు నష్టం కలిగే అవకాశం ఉంది, నీటి వసతి ఉన్న రైతులు సైతం సాగు చేయొద్దని, ఆశించినస్థాయిలో వర్షాల పడిన తర్వాతనే పంటలు సాగు చేయాలని రైతులకు విజ్ఞప్తి చేశారు. పత్తి విత్తనాలు జూలై 15వ తేదీ వరకు విత్తుకోవచ్చని ఏవో తెలిపారు.

పరామర్శ

చొప్పదండి: ప్రమాదవశాత్తు ద్విచక్రవాహనంపై నుంచి పడి కరీంనగర్‌లో చికిత్స పొందుతున్న కొండగట్టు దేవస్థానం డైరెక్టర్, చొప్పదండికి చెందిన గొల్లపల్లి శ్రవణ్‌కుమార్‌ను ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, బీఆర్‌ఎస్ నాయకులు సోమవారం పరామర్శించారు.

వక్ఫ్‌బోర్డు భూమి అన్యాక్రాంతంపై ఫిర్యాదు

గంగాధర: మండలంలోని గర్శకుర్తి గ్రామంలోని వక్ఫ్‌బోర్డు భూముల అన్యాక్రాంతంపై ముస్లిం మైనారిటీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు సోమవారం తహసీల్దార్, కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. గ్రామంలోని సర్వే నంబర్ 544లో 1.08 ఎకరాల భూమిని కబ్జాదారుల నుంచి కాపాడాలని కోరారు. కార్యక్రమంలో శుక్రొద్దీన్, నాజర్ మహ్మద్, నజీర్, అల్లాబకాస్, షరీఫ్, షాదిక్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న నిరాహార దీక్ష

గంగాధర: మండలంలోని గర్శకుర్తి గ్రామాన్ని మండల కేంద్రంగా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ మండల సాధన కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన నిరాహార దీక్ష సోమవారంతో 51వ రోజుకు చేరుకుంది. దీక్షకు బీఆర్‌ఎస్ నాయకులు సంఘీబావం తెలిపారు. మద్దతు తెలిపిన వారిలో అలువాల తిరుపతి, దూస అనిల్, కమటం రాజమల్లయ్య, తడిగొప్పుల రమేష్, అలువాల శ్రీనివాస్, గుంటుకు మల్ల య్య, దాది జలపతి, నల్ల శ్రీనివాస్, రవి, గణేష్, రాజేందర్, అఖిల్ తదితరులు ఉన్నారు.

హద్దులు చూపించాలి

రామడుగు: మండలంలోని గుండి-గోపాల్‌రావుపేట గ్రామాల రెవెన్యూ హద్దులు నిర్ణయించి ప్రభుత్వం న్యాయం చేయాలని గుండి ఉపసర్పంచ్ శ్రీనివాస్‌గౌడ్ సోమవారం ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. రెండు గ్రామాలకు సరైన హద్దులు లేకపోవడంతో ప్రజలు ఇబ్బందిపడుతున్నారని గతంలో హద్దులు నిర్ణయించాలని అధికారులకు విన్నవించినప్పటికీ అధికారుల స్పందనలేదన్నారు.

నిబంధనలు పాటించని స్కూళ్ల గుర్తింపు రద్దు చేయాలి

హుజూరాబాద్: ప్రభుత్వ నియమనిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న ప్రైవేట్ స్కూళ్లపై చర్యలు తీసుకోవాలని కోరుతూ అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ హుజూరాబాద్ శాఖ ఆధ్వర్యంలో సోమవారం ఎంఈవోకు వినతిపత్రం అందజేశారు. మండల వ్యాప్తంగా ఉన్న ప్రైవేటు పాఠశాలల్లో పుస్తకాలు అమ్ముతున్నారని, విద్యాలయాలను వ్యాపార కేంద్రాలుగా మారుస్తున్నారని ఆపాఠశాలల గుర్తింపు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు రోహిత్, అజయ్, ఉభయ్, చితాల ఆకాశ్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలు వివరించాలి

శంకరపట్నం: కేంద్ర ప్రభుత్వ పథకాలను 21 నుంచి ఇంటింటికి వివరిస్తూ ప్రచారం చేయాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు మాడ వెంకట్‌రెడ్డి అన్నారు. మండలంలోని కొత్తగట్టు గ్రామంలో సోమవారం మహాసంపర్క్ అభియాన్ సమావేశం నిర్వహించారు. 21 యోగా దినోత్సవంలో పాల్గొనాలని సూచించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు అనిల్, దండు కొంరయ్య, సమ్మిరెడ్డి, తదితరులున్నారు.

పీఏసీఎస్ బంక్‌లకు నో సబ్సిడీ

- అధిక ధరలకు డీజిల్, పెట్రోల్ సరఫరా
- రైతులపై మోయలేని భారం
- పోటీపడలేక మూతపడనున్న బంక్‌లు



కందుగుల గ్రామంలోని రైతు ఉత్పత్తిదారుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పెట్రోల్ బంక్

హుజూరాబాద్‌రూరల్: రైతులకు సేవలదించాలన్న లక్ష్యంతో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు ఏర్పాటు చేసిన పెట్రోల్ బంక్‌లకు కేంద్ర ప్రభుత్వం అధిక ధరలకు డీజిల్, పెట్రోల్ సరఫరా చేస్తుండటంతో వాణిజ్యపరమైన బంక్‌లతో పోటీ పడలేక అవి మూతపడుతున్నాయి. సహకార సంఘాలు నిర్వహించే బంక్‌లకు సరఫరా చేస్తున్న పెట్రోల్‌పై రూ.7, డీజిల్‌పై రూ.12 చొప్పున కేంద్ర ప్రభుత్వం ధరలు పెంచింది. ఫిబ్రవరి 16 నుంచి ధరలు అమల్లోకి వచ్చాయి. ఫలితంగా రైతులు రాయితీపై డీజిల్, పెట్రోల్ దొరక్క ఆర్థికంగా నష్టపోతున్నారు.

లాభాపేక్ష లేకుండా...

వ్యాపారులు నిర్వహించే బంక్‌లను సేవా కేంద్రాలుగా, సింగిల్ విండోలు నిర్వహించే వాటిని వినియోగదారుల సేవా కేంద్రాలుగా పరిగణిస్తారు. వాణిజ్యపరంగా నిర్వహించే బంక్‌ల్లో అందరికి పెట్రోల్, డీజిల్ విక్రయిస్తారు. సింగిల్‌విండోలు నిర్వహించే బంక్‌ల్లో ఆ సహకార సంఘాల సభ్యులు రైతులకే విక్రయిస్తారు. ఈ సంఘాలు లాభాలను తగ్గించుకుని డీజిల్‌పై రూపాయి, పెట్రోల్‌పై రూ.50 పైసలు తగ్గించి విక్రయిస్తాయి. ఇతర బంక్‌ల్లో కల్తీ చేసే అవకాశాలు ఉండగా, సంఘాలు నిర్వహించే బంక్‌ల్లో కల్తీకి ఆస్కారం ఉండదు. కల్తీ లేని డీజిల్, పెట్రోల్ కొంత తక్కువ ధరకు లభిస్తుండటంతో సహకార సంఘాలు నిర్వహించే బంక్‌ల్లోనే రైతులు అధికంగా కొనుగోలు చేస్తుంటారు.

వాణిజ్య బంక్‌లకు వత్తాసు..

వాణిజ్య బంక్‌ల్లో ఏరోజుకారోజు పెట్రోలు, డీజిల్ ధరలను తప్పనిసరి సవరించాలి. కానీ సహకార సంఘాలు నిర్వహించే బంకుల్లో మాత్రం ప్రతినెలా 1, 16వ తేదీల్లో మాత్రమే సవరించుకోవాలనే నిబంధన విధించారు. పైగా వీటికి ఫిబ్రవరి 16కు ముందుకు సరఫరా ధరలతో పోలిస్తే డీజిల్‌పై రూ.12.09, పెట్రోల్‌పై రూ.7.23 అదనంగా వడ్డించారు. వాణిజ్య బంక్‌లకు సరఫరా ధరలు పెంచకపోవడం గమనార్హం. ప్రస్తుతం వాణిజ్య బంకుల్లో డిజిల్ రూ.97.82, పెట్రల్‌రూ. 109.68 చొప్పున విక్రయిస్తున్నారు. సహకార సంఘాల బంక్‌లు వాణిజ్య బంక్‌ల ధరలతో పోటీపడి తమకు సరఫరా అయన ధరకే పెట్రోలు అమ్మితే లీటర్‌కు రూ.4.18, డీజిల్‌పై రూ.2.71 నష్టపోవాల్సిందే. పైగా నిర్వహణ వ్యయం కూడా భరించాలి.

రైతులపై మోయలేని భారం...

రసాయన ఎరువులు, విత్తనాల ధరలు పెంచిన ప్రభుత్వం అదే కోవలో డీజిల్, పెట్రోల్ ధరలతో రైతులపై మరింత భారాన్ని మోపింది. హుజూరాబాద్ మండలంలోని కందుగుల గ్రామంలో రైతు ఉత్పత్తిదారుల సహకార సంఘం, హుజూరాబాద్ పీఏసీఎస్ ఆధ్వర్యంలో బంకులు నడుస్తున్నాయి. ఈబంక్‌ల్లోనే చాలా మట్టుకు రైతులు డీజిల్, పెట్రోల్‌ను కొనుగోలు చేస్తున్నారు. పెంచిన ధరలతో రైతులపై మోయలేని భారం పడుతుంది. కేంద్ర ప్రభుత్వం స్పందించి సహకార సంఘాల బంక్‌లకు సరఫరా చేసే డీజిల్, పెట్రల్ ధరలను తగ్గించాలని రైతులు కోరుతున్నారు.

ధరలు తగ్గించి పెట్రోలు, డీజిల్ సరఫరా చేయాలి



సహకార సంఘం సభ్యులకు మాత్రమే ఇంధనం విక్రయించే తమ సంఘాలు నిర్వహించే బంక్‌లకు కేంద్ర ప్రభుత్వం ధరలు తగ్గించి పెట్రోలు, డీజిల్‌ను సరఫరా చేయాలి. లాభాపేక్ష లేకుండా రైతులకు సేవ చేయాలన్న తలంపుతో ఏర్పాటు చేసిన ఈ బంక్‌లకు అప్పుడే మనుగడ ఉంటుంది.

– ఎడవెల్లి కొండాల్‌రెడ్డి,పీఏసీఎస్ చైర్మన్,హుజూరాబాద్.

నాటిన మొక్కలు సంరక్షించాలి

అదనపు కలెక్టర్ గరిమాఅగర్వాల్



మొక్కలు నాటుతున్న గరిమాఅగర్వాల్

మానకొండూర్: హరితహారంలో నాటిన మొక్కలను సంరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందని అదనపు కలెక్టర్ గరిమాఅగర్వాల్ అన్నారు. మండలంలోని ఈదులగట్టెపల్లి గ్రామంలోని కాకతీయ కాలువ స్థలంలో హరితోత్సవం సందర్భంగా మొక్కలు నాటారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తెలంగాణ ఏర్పడ్డ తర్వాత హరితహారంలో పెద్ద ఎత్తున నాటామని, భవిష్యత్తు తరాల కోసం ఇంకా చాలా మొక్కలు నాటాల్సి ఉందన్నారు. తొమ్మిదేళ్లలో కరీంనగర్‌లోనే రెండు కోట్ల మొక్కలు నాటామని తెలిపారు. కార్యక్రమంలో సుడా చైర్మెన్ జీవీ రామక్రిష్ణారావు, మండల పరిషత్ అధ్యక్షురాలు ముద్దసాని సులోచన, జడ్పీటీసీ తాళ్లపల్లి శేఖర్‌గౌడ్, నీటి పారుదల ఎస్‌ఈ శివకుమార్, నీటిపారుదల ఈఈ నాగభూషణం, డీఆర్‌డీవో శ్రీలత, అదనపు డీఆర్‌డీవో సంధ్యారాణి, జిల్లా పంచాయతీ అధికారి వీరబుచ్చయ్య, నీటిపారుదల డీఈ సమ్మయ్య, సర్పంచ్ దాసరి సరిత, ఎంపీడీవో నీలగిరి దివ్యదర్శన్‌రావు, ఎంపీవో రాజేశ్వర్‌రావు, కార్యదర్శి స్వర్ణలత, ఏపీఎం సంతోష్, నిరంజన్, టీఏలు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

హరితహారంతో ఆకుపచ్చ తెలంగాణ



హరితోత్సవంలో నుస్తులాపూర్ సర్పంచ్ రావుల రమేశ్

తిమ్మాపూర్: రాష్ట్రం ఏర్పడిన తర్వాత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న హరితహారం కార్యక్రమంతో తెలంగాణ ఆకుపచ్చగా మారిందని, అటవీ విస్తీర్ణం గణనీయంగా పెరిగిందని జెడ్పీ సీఈవో ప్రియాంక అన్నారు. రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది వేడుకల్లో భాగంగా మహాత్మనగర్ గ్రామంలో సోమవారం హరితోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా జెడ్పీ సీఈవో హాజరయ్యారు. ఎంపీపీ కేతిరెడ్డి వనిత, సర్పంచ్ జక్కుల శ్రీవాణితో కలిసి మొక్కలు నాటారు. అనంతరం ప్రియాంక మాట్లాడుతూ... నాటిన ప్రతి మొక్కని సంరక్షించాలని, సర్పంచుల కృషితోనే పల్లెలు పచ్చదనంతో కళకళలాడుతున్నాయన్నారు. అనంతరం పంచాయతీ సిబ్బంది, వన సంరక్షులను సత్కరించారు. నుస్తులాపూర్‌లో సర్పంచ్ రావుల రమేష్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో రవీందర్ రెడ్డి, ఎంపీవో కిరణ్ కుమార్ ఎంఈఓ, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా హరితోత్సవం



గంగాధర: మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే



హుజూరాబాద్‌లో ప్రతిజ్ఞ చేస్తున్న పాడి కౌశిక్‌రెడ్డి

హుజూరాబాద్: ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొక్కలు నాటారు.

గంగాధర: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటే కార్యక్రమాన్ని సామాజిక బాధ్యతగా తీసుకున్నపుడే భవిష్యత్ తరాలకు కాలుష్య రహిత సమాజాన్ని అందించగలుగుతామని ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. మండల కేంద్రంలో హరితోత్సవంలో భాగంగా ఎమ్మెల్యే మొక్కలు నాటారు. వాతావరణ కాలుష్య నివారణ, సకాలంలో వర్షాలు కురవడానికి మొక్కలు నాటాలన్నారు.

రామడుగు: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ ఆవరణలో డ్రాగన్ ఫ్రూట్స్ మొక్కలు నాటారు.

గంగాధర: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటే కార్యక్రమంలో భాగస్వా మ్యులు కావాలని ఎస్సై పుల్ల అభిలాశ్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ఆవరణలో సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు.

చొప్పదండి: మండలంలో రుక్మాపూర్ సైనిక స్కూల్‌లో ఎంపీపీ రవీందర్, రెవెళ్లిలో జెడ్పీటీసీ మాచర్ల సౌజన్య, ఏఎంసీ చైర్మన్ గడ్డం చుక్కరెడ్డి మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఇల్లందకుంట: మండలంలోని అన్ని గ్రామాల్లో హరితదినోత్సవం నిర్వహించారు. పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఎస్సై తోట తిరుపతి మొక్కలు నాటారు.

జమ్మికుంట: మున్సిపల్ పరిధి, మండలంలోని గ్రామాలలో హరితోత్సవం నిర్వహించారు.

మానకొండూర్‌రూరల్: వివిధ గ్రామాలలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు మొక్కలు నాటారు. మండలంలోని శ్రీనివాస్‌నగర్‌లో కేజీబీవీ విద్యార్థినులు స్పెషల్ ఆఫీసర్ స్వప్న ఆధ్వర్యంలో మొక్కలు నాటారు.

గన్నేరువరం: మండలంలోని వివిధ గ్రామాల్లో హరితోత్సవం నిర్వహించారు. పల్లె ప్రకృతి వనం దగ్గర జాతీయ ఉపాధిహామీ కూలీలు, సిబ్బందిని శాలువాతో ప్రజాప్రతినిధులు సన్మానించారు.

శంకరపట్నం: మండలంలోని తాడికల్ సంపదవనంలో ఎంపీడీవో బషీరొద్దీన్, ఏపీవో శారద, సర్పంచ్ సుజాత, మహిళలు మొక్కలు నాటారు. వివిధ గ్రామాల్లో సర్పంచ్‌లు, కార్యదర్శులు, మహిళలతో కలిసి మొక్కలు నాటారు.

ఇసుక తవ్వకాల నిలిపివేత

వీణవంక: మండలంలోని చల్లూరు, కొండపాక, మల్లారెడ్డిపల్లి, కోర్కల్, పోతిరెడ్డిపల్లి సమీప మానేరువాగులో ఇసుక తవ్వకాలను నిలిపివేయాలని సుప్రీంకోర్టు ఆదేశాలిచ్చింది. కలెక్టర్ కర్ణన్ క్వారీలను నిలిపివేయాలని సోమవారం తహసీల్దార్ రాజయ్యను ఆదేశించారు. తహసీల్దార్ క్షేత్రస్థాయిలోవెళ్లి తవ్వకాలను నిలిపివేశారు. లారీలను వెనక్కి పంపించారు. డిస్టిలేషన్ పేరుతో వీణవంక, జమ్మికుంట మండలాల్లోని మానేరు వాగులో ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయని, పర్యావరణ అనుమతులు లేవని కొందరు జాతీయ హరిత ట్రిబ్యూనల్‌ను ఆశ్రయించారు. పర్యావరణ అనుమతులు లేనిదే మానేరులో ఇసుక తవ్వకాలు చేపట్టరాదని, ఏప్రిల్ 18న ఎన్జీటీ మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది. క్షేత్రస్థాయిలో ఇసుక తవ్వకాలు జరుగుతుండటంతో పర్యావరణ పరిరక్షణ సమితి నాయకులు సుప్రీంకోర్టును ఆశ్రయించగా ఇసుక తవ్వకాలను నిలిపివేయాలని జూన్ 13న సుప్రీంకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. తహసీల్దార్ రాజయ్య క్వారీల వద్దకు వెళ్లి లారీలను వెనక్కి పంపించారు.

తల్లి, కొడుకుల నిరసన

శంకరపట్నం: వ్యవసాయబావికి విద్యుత్ కనెక్షన్ కోసం పక్కనున్న రైతులు విద్యుత్ స్తంభాలు వేయనీయడం లేదని కరెంట్ సరఫరా నిలిపివేసి తల్లి, కొడుకులు సోమవారం ఆందోళన చేశారు. మండలంలోని లింగాపూర్ గ్రామంలో కవ్వ రాజిరెడ్డి వ్యవసాయభూమిలో ట్రాన్స్‌కో అధికారులు రైతుల కోసం ట్రాన్స్‌ఫార్మర్ వేశారు. ట్రాన్స్‌ఫార్మర్ నుంచి రాజిరెడ్డి వ్యవసాయబావికి విద్యుత్ కనెక్షన్ ఇచ్చేందుకు మూడు స్తంభాలు అవరసం కాగా రెండు వేశారు. మరో విద్యుత్ స్తంభం వేరే రైతు పొలంలో వేయకుండా అడ్డుకోవడంతో అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోవడంతో వరి నారు పోసేందుకు విద్యుత్ కనెక్షన్ లేకపోవడంతో తల్లి అనసూయతో కలిసి విద్యుత్ సరాఫరా నిలిపివేసి ట్రాన్స్‌ఫార్మర్ గద్దెను ఎక్కి రాజిరెడ్డి నిరసన తెలిపాడు.

రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలు



జమ్మికుంట: రక్తదానం చేస్తున్న నాయకులు

రామడుగు: మండలంలో సోమవారం ఏఐసీసీ మాజీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలను కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు.

ఇల్లందకుంట: మండల కేంద్రంలో జన్మదినం సందర్భంగా నాయకులు శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు చేశారు.

వీణవంక: మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద సీనియర్ నాయకుడు చింతల శ్యాంసుందర్‌రెడ్డి ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు.

హుజూరాబాద్: కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేశారు. అనంతరం ప్రభుత్వాసుపత్రిలో యువజన కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి తిప్పారపు సంపత్‌తో పాటు పలువురు కార్యకర్తలు రక్తదానం చేసి రోగులకు పండ్లు పంపిణీ చేశారు.

చిగురుమామిడి: మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో వేడుకలు నిర్వహించిన అనంతరం పార్టీ మండల అధ్యక్షుడు తిరుపతిరెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్‌కు ఆదరణ పెరుగుతోందన్నారు.

గన్నేరువరం: మండల కేంద్రంలో పార్టీ మండల అధ్యక్షుడు ఉపేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. జిల్లా కార్యదర్శి అనంతరెడ్డి, గ్రామశాఖ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, ఎస్సీ, బీసీ, కిసాన్ సెల్ అధ్యక్షులు అనిల్, మల్లేశం, చంద్రారెడ్డి, మండల, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శులు అంజి, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

జమ్మికుంట: పట్టణంలోని హుజూరాబాద్ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ఉపాధ్యాక్షుడు సజ్జద్ మహమ్మద్ ఆధ్వర్యంలో రక్తదానం శిబిరం నిర్వహించారు. అంబేద్కర్ చౌరస్తా వద్ద బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మొలుగూరి సదయ్య ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు.

శంకరపట్నం: కేశవపట్నంలో నాయకులు కేక్‌కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు బస్వయ్య, నాయకులు పాల్గొన్నారు.

నియామకం

రామడుగు: తెలంగాణ అంబేడ్కర్ సంఘం రామడుగు మండల ప్రధాన కార్యదర్శిగా గజ్జెల నవీన్‌కుమార్ నియామకమయ్యారు. సోమవారం చొప్పదండి నియోజకవర్గ అధ్యక్షుడు జెట్టుపల్లి అనిల్‌కుమార్, మండల అధ్యక్షుడు మహేశ్ ఉత్తర్వులు జారీ చేశారు.

సీఐని కలిసిన నాయకులు

తిమ్మాపూర్: ఇటీవల తిమ్మాపూర్ సర్కిల్ సీఐగా బాధ్యతలు స్వీకరించిన ఇంద్రసేనారెడ్డిని సోమవారం పలువురు నాయకులు కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. కలిసిన వారిలో రామకృష్ణ కాలనీ ఉపసర్పంచ్ ప్రణీత్‌రెడ్డి, వార్డు సభ్యుడు రెడ్డి సంఘం అధ్యక్షుడు దావు సంపత్ రెడ్డి, మాచర్ల శ్రీనివాస్ గౌడ్, వైఎస్సార్‌టీపీ రైతు సంరక్షణ సంఘం అధ్యక్షుడు సింగిరెడ్డి భాస్కర్ రెడ్డి ఉన్నారు.

జమ్మికుంటరూరల్ సీఐగా కిశోర్

ఇల్లందకుంట: జమ్మికుంటరూరల్ సీఐగా కోరే కిశోర్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన సీఐ జివ్వాజీ సురేష్ ఆసిఫాబాద్‌టౌన్‌కు బదిలీ అయ్యారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ.. శాంతిభద్రతల విషయంలో ఎలాంటి రాజీలేకుండా పనిచేస్తామని, అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టిసారిస్తామని తెలిపారు. సీఐకి ఎస్సై తోట తిరుపతి, సిబ్బంది ఘన స్వాగతం పలికారు.

టీఎస్‌టీడీసీ చైర్మన్‌ను కలిసిన కౌన్సిలర్

జమ్మికుంట: తెలంగాణ రాష్ట్ర టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గెల్లు శ్రీనివాస్‌ను హైదరాబాద్‌లో జమ్మికుంట పట్టణం హౌజింగ్ బోర్డు కౌన్సిలర్ శ్రీపతినరేష్‌గౌడ్ సోమవారం మర్యాద పుర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. పట్టణంలోని నాయిని చెరువులో ప్రజల ఆహ్లాదం కోసం బోటింగ్ ఏర్పాటు చేయాలని వినతిపత్రం అందజేశారు. అధికారులతో చెరువును పరిశీలించి బోటింగ్ ఏర్పాటుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారని నరేష్ తెలిపారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇవ్వాలని ధర్నా




తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

చిగురుమామిడి: తెలంగాణ ప్రజా సంఘాల పోరాట వేదిక ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం సోమవారం ఎదుట ధర్నా నిర్వహించారు. నిరుపేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు, నివేశన స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేశ్ మాట్లాడుతూ.. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు గడుస్తున్నా పేదవాడికి సొంతిల్లు లేక, చేతినిండా పనిలేక, అద్దె ఇళ్లలో కాలం వెల్లదీస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి పౌరుడికి కనీస అవసరాలు కల్పించాలని భారత రాజ్యాంగం చెబుతున్నప్పటికీ పాలకులు పట్టించుకోవడంలేదన్నారు. ఇంటి నిర్మాణానికి రూ.15 లక్షలు మంజూరు చేయాలన్నారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయకార్యదర్శి శ్రీలత, తదితరులు పాల్గొన్నారు.

కేబుల్ బ్రిడ్జి ప్రారంభోత్సవానికి తరలిరావాలి

హుజూరాబాద్: పురపాలక, ఐటీశాఖ మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా 21న కరీంనగర్‌లో కేబుల్ బ్రిడ్జిని ప్రారంభించనున్నారని, హుజూరాబాద్ నియోజకవర్గం నుంచి బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు తరలిరావాలని ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్ కోరారు. సోమవారం పట్టణంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

మహాజలాభిషేకం



జమ్మికుంట: వర్షాలు కురవాలని పట్టణంలోని విశ్వేశ్వరస్వామి (బొమ్మలగుడి) దేవాలయంలో అన్నపూర్ణ సేవా సమితి, ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో సోమవారం స్వామివారికి మహాజలాభిషేకం కార్యక్రమం నిర్వహించారు. వేద పండితులు, ఆర్యవైశ్యులు స్వామివారికి వేద మంత్రోచ్ఛరణలతో అభిషేకం చేశారు. భక్తులు బిందెలతో నీళ్లు తీసుకొని వచ్చి స్వామివారిని వేడుకుంటూ మొక్కులు చెల్లించారు. కార్యక్రమంలో అన్నపూర్ణ సేవా సమితి, పట్టణ ఆర్యవైశ్య సంఘం నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

మున్నూరుకాపు సంఘం నాయకుల వినతి

చొప్పదండి: నిరుపేద మున్నూరుకాపు విద్యార్థులు చదువుకునేందుకు అనువుగా జిల్లా కేంద్రాల్లో హాస్టల్ భవనాలకు ప్రభుత్వం స్థలం కేటాయించాలని మున్నూరుకాపు సంఘం మండల అధ్యక్షుడు గాండ్ల లక్ష్మణ్ ఆధ్వర్యంలో మున్నూరుకాపు సంఘం ప్రతినిధులు తహసీల్దార్ అంబటి రజితకు సోమవారం వినతిపత్రం అందించారు. అనంతరం మాట్లాడుతూ... మున్నూరుకాపు సంఘం ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఆయన వెంట పట్టణ సంఘం అధ్యక్షుడు మరిమడ్ల రాజు పటేల్, చుక్క ప్రవీణ్, సత్తు తిరుపతి, రవి, పబ్బ శ్రీనివాస్, సత్యం, తదితరులు పాల్గొన్నారు.

ఇల్లందకుంట: మున్నూరుకాపుల న్యాయమైన హక్కుల సాధనకు సంఘం మండల అధ్యక్షుడు అప్పాల రమేష్ ఆధ్వర్యంలో నాయకులు తహసీల్దార్ సురేఖకు వినతిపత్రం అందజేశారు.

చిగురుమామిడి: మండల మున్నూరుకాపు సంఘం నాయకులు ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కోరుతూ తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. సంఘం మండలశాఖ అధ్యక్షుడు శంకర్, నాయకులు సమస్యలు ప్రస్తావించారు.

జమ్మికుంట: తహసీల్దార్ రాజేశ్వరికి మున్నూరుకాపు నియోజకవర్గ కన్వీనర్ పొనగంటి మల్లయ్య ఆధ్వర్యంలో నాయకులు వినతి పత్రం అందజేశారు. వ్యవసాయమే జీవనాధారంగా జీవిస్తున్న మున్నురుకాపులను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

పీఏసీఎస్ చైర్మన్, సీఈవోకు సన్మానం

చొప్పదండి: పంట, దీర్ఘకాలిక రుణాలను వందశాతం రికవరీ చేసినందుకు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ఆధ్వర్యంలో చొప్పదండి పీఏసీఎస్ చైర్మన్ వెల్మ మల్లారెడ్డి, సీఈవో క్లోం తిరుపతిరెడ్డిని సోమవారం ఘనంగా సన్మానించారు. కేంద్ర సహకార బ్యాంకులో జరిగిన సమావేశంలో టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్ రావు చైర్మన్, సీఈవోలను సన్మానించి జాతీయ స్థాయిలో సహకార సంఘాలలో ఉత్తమ సంఘంగా ఎంపికవ్వడానికి కృషి చేసినందుకు వారి సేవలను కొనియాడారు. ఏటా వందశాతం రుణాల రికవరీతో ఆదర్శంగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో కేంద్ర సహకార బ్యాంకు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ క్రీడల్లో 'జ్యోతిష్మతి' సత్తా

తిమ్మాపూర్: ఇటీవల సింగాపూర్ కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన నేషనల్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్లో జ్యోతిష్మతి అటానమస్ ఇంజినీరింగ్ కళాశాల ద్వితీయ సంవత్సరం విద్యార్థులు సత్తా చాటారు. అభిరామ్ చదరంగంలో మొదటి స్థానంలో నిలిచి, చాంపియన్ ట్రోఫీ అందుకోగా, బాలికల విభాగంలో టేబుల్ టెన్నిస్ డబుల్స్‌లో లహరి, శ్రీలేఖలు మొదటి స్థానంలో నిలిచి, బహుమతి సాధించారు. కళాశాలలో సోమవారం ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో చైర్మన్ జువాడి సాగర్‌రావు, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాసరావు, డీన్ కె.వైశాలి, ఫిజికల్ డైరెక్టర్ ఆర్.వెంకటేశ్వరరావు విద్యార్థులను అభినందించారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

శంకరపట్నం: మండలంలోని కల్వల గ్రామానికి చెందిన పల్లెపు మమత(35) చికిత్స పొందుతూ మృతిచెందినట్లు కేశవపట్నం ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు. కొంతకాలంగా అనారోగ్యం, ఆర్థిక ఇబ్బందులతో మమత మద్యానికి బానిసైంది. ఈ నెల 17న క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. కుటుంబ సభ్యులు వరంగల్ ఎంజీఎంకు తరలించగా చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున చనిపోయింది. మృతురాలి తల్లి శోభ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మమతకు భర్త కుమార్, ఇద్దరు కుమారులు ఉన్నారు.

అనారోగ్యంతో వృద్ధురాలి..

గన్నేరువరం: మండలంలోని గునుకులకొండాపూర్‌కు చెందిన లింగంపల్లి భూలచ్చవ్వ(65) సోమవారం మృతిచెందిందని స్థానికులు తెలిపారు. కొన్ని రోజులుగా అనారోగ్యంతో ఇబ్బంది పడుతోందన్నారు. అదే సమయంలో వడదెబ్బకు గురైనట్లు పేర్కొన్నారు. మృతురాలి భర్తతోపాటు కొడుకు, పెద్ద కూతురు వివిధ కారణాలతో గతంలోనే మృతిచెందారని చెప్పారు. చిన్న కూతురు కనకలక్ష్మి తన తల్లికి దహన సంస్కారాలు నిర్వహించింది. అంత్యక్రియలకు సర్పంచ్ లింగంపల్లి జ్యోతి, కరీంనగర్ బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి లింగంపల్లి నాగరాజు, బీజేపీ నాయకులు అజయ్‌వర్మ, బాల్‌రాజు, సమ్మరాజు, అనిల్, తాళ్లపల్లి శ్రీనివాస్‌గౌడ్, గ్రామస్తులు హాజరయ్యారు.